


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఎపిసోడ్ 1: (జనవరి)*

*శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో 18 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.*

❀❀❀

*ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)*

*రాబీ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.*

❀❀❀

*ఎపిసోడ్: 3 (మార్చ్)*

*శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.*

*జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.*

❀❀❀

*ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్ష పురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్లు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.*

❀❀❀

ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.

ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.

ఎపిసోడ్ 7: (జూలై)

తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.

ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.

మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.

ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)

ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.

ప్రకృతి నాశకులు రాక్షసులు

ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.

**"హనుమంతు"**

కాంపౌండ్ గోడ చాలా ఎత్తుగా వుంది. లోపలికి దూకితేగానీ మహా కన్యాదేవిగారిని చూడటం కుదరదు. గోడకి దగ్గరగా ఇవతలి వైపున సత్తిరాజు గారి కొబ్బరి తోట వుంది. ఓ చెట్టు మీదకి ఎక్కగలిగితే ఆశ్రమం లోపలికి చూడొచ్చు. చాలా జాగ్రత్తగా కొబ్బరి మట్టని పట్టుకుని జారితే గోడమీదకి చేరవచ్చు. లోపలికి దూకటం ప్రమాదకరమే. దాదాపు అయిదారు గజాలకి పైగా ఎత్తుండే గోడ అది.

"నా పేరు హనుమంతు. గోడలు చెట్లు నన్నేం చెయ్యగలవూ" తనలో తను అనుకుని చిద్విలాసంగా నవ్వుకున్నాడు హనుమంతు. హనుమంతు శరీరం ఉక్కు కడ్డీలాంటిది.

"ఒరే హనుమంతూ.. నువ్వీ మధ్య చాలా ఆలోచిస్తున్నావు. నీ బుర్రలో ఏముందో చెప్పు" నడుస్తున్నవాడల్లా ఠక్కున ఆగి అన్నారు అవధానిగారు.

"ఏం లేదు .! ఆలోచనలు పెద్దోళ్ళకి వుంటాయిగానీ నా దగ్గరేంవుంటై అయ్‌గోరూ.." నవ్వాడు హనుమంతు.

"బుకాయించకు. ఒకటి గుర్తుపెట్టుకో. అనవసర కుతూహలాలతో మనసుని భ్రష్టుపట్టించకు. మనుషుల కష్టాలన్నింటికీ కారణం అనవసర కుతూహలమే. నువ్వు చూడ్డానికి చిన్నవాడివే. కానీ నీది మామూలు వ్యవహారంకాదు. వాలీ సుగ్రీవుడూ ఇద్దర్నీ కలగలిపితే వుండే అన్ని అల్లరి చేష్టలు నీలో వున్నాయి. అబ్బాయ్ నీ బుర్రని ఏదో తొలుస్తోంది. దాన్ని వీలున్నంత త్వరగా వదిలించుకో" హెచ్చరించారు అవధానిగారు.

"రాసి వున్నది జరిగి తీరుతుందనే గదా బాబాయ్ మీరు ఎప్పుడూ చెప్పేదీ! ఏమి రాసివుందో నాకెం తెలుసూ? అయినా మీరుండగా నాకేం భయం." పకపకా నవ్వి అన్నాడు హనుమంతు. చిత్రమైనవి అతని మాటలు. ఒక్కోసారి చదువు రాని వాడిలా , ఒక్కోసారి మహా మేధావిలా మాట్లాడుతుంటాడు. పిట్టకొంచెం - కూత ఘనం. అవధాని మాట్లాడలేదు. ఆయన మనసూ వ్యాకులంగా వుంది. ఏదో తెలీని ఓ అలజడి. ఎప్పుడూ ప్రశాంతంగా నిద్రపోయే అలవాటు. ఈ మధ్య తెల్లార్లూ కలల్లో పాములు. రంగురంగుల పాములు. భయంకరంగా పడగలెత్తి బుసలు కొట్టే పాములు కొన్నైతే, చుట్ట చుట్టుకుని నిశ్చలంగా పడుకున్న కొండచిలువలు, కొన్ని చెట్ల కొమ్మలకి వేలాడుతూ, అప్పుడప్పుడూ ఓ కొమ్మ మీంచి మరో కొమ్మ మీదకి ఎగిరే పచ్చని పసిరిక పాములు కొన్నైతే, మొగలి పొదల్ని చుట్టుకుని వున్న మొగలి పాములు కొన్ని. అతివేగంగా, సన్నగా క్రూరంగా పాకుతున్న కట్లపాములు కొన్నైతే, నూనె వాసన కొట్టే నూనె పలుగుడు పాములు కొన్ని. చిన్న తలతో భారీ శరీరంతో పాకే పొడల పాములు కొన్నైతే, అయిదారు గజాల పొడుగుండి నీళ్ళమీద తేలియాడుతున్న బురదగట్లు కొన్ని, ఎర్రవీ, పసుప్పచ్చవీ, నల్లనివీ, తోకలతో శబ్దం చేసేవీ, మెరుపు వేగంతో కప్పల్నీ ఎలుకల్నీ కాక కుందేళ్ళనీ బాతుల్నీ కూడా మింగుతున్నవీ ఇలా అవధానిగారి కలల్లో పాములు దర్శనమిచ్చి ఆయన స్వచ్ఛమైన మనసుని కలవరపెడుతున్నాయి.

"రాత్రిపూట దాహంతో పడుకుంటే పాములు కలలోకి వస్తాయి. పడుకోబోయేముందు ఓ గ్లాసెడు నీళ్ళు తాగు. పాములు కల్లోకి రమ్మన్నా రావు" సలహా చెప్పాడు సత్తిరాజు అని పిలువబడే సత్యనారాయణగారు. ఆయా స్వచ్ఛమైన క్షత్రియుడు. మోతుబరి. అందరికీ తలలో నాలుకలాంటి వాడేగాక మంచి వైద్యుడు కూడా, సత్తిరాజు గారి కుటుంబంలో జ్యోతిష్యమూ వైద్యమూ తరతరాలుగా వస్తున్నాయి.

"పడుకోబోయేముందు నీరు తాగటం నా అలవాటు. అయినా సత్తిరాజుగారూ, యీ పాములు రావడం అంటే, కల్లోకి రావడం మొదలై దాదాపు పదిహేను రోజులు అవుతోందండీ. జెర్రిగొడ్లూ, గోధుమ త్రాచులూ, తెల్ల త్రాచులు కూడా కల్లోకొస్తున్నాయి. అలాగే కొండపాములూ, తాటిపాములూ కూడా కనబడుతున్నాయి. అవన్నీ కూడా ఓ మండపంలోంచి బుసలు కొడుతూ బయటికొస్తున్నాయి. దొంగలు వూళ్ళమీద పడినట్లు, అవన్నీ నాలుగు దిక్కులకీ నాలుగు మూలలకీ పరిగెడుతున్నాయి. ఆ కల దేనికో 'సంకేతం' అని నా భావన. అంతేకాదు మనసులో అంతులేని అలజడి" తలనొక్కుకుని అన్నారు అవధాని.

"మీరు చెప్పేది వింటే, మీరన్నట్టు ఆ కలలన్నీ ఏదో జరగబోయే ఘోరానికి సూచనగానే కనపడుతున్నాయి. పాములు ఓ విధంగా కర్షక మిత్రులు. అవి ఎలుకల్ని లక్షలాదిగా మింగుతాయి గనకనే మనపంట మనకి సింహభాగం చేతికొస్తోంది. అదీగాక అవి చాలా పిరికివి. వాటిని చూస్తే మనకెంత భయమో, మనని చూస్తే వాటికీ అంతే భయం. ఎందుకయినా మంచిది, నేను కూడా మా నాన్నగారితో యీ సమస్య వివరించి జ్యోతిష్య పరిష్కారం ఏదన్నా దొరుకుతుందేమో చూస్తాను" అవధానిని వదిలి ముందుకు నడుస్తూ అన్నాడు సత్యనారాయణ రాజుగారు. వారి తండ్రికి ఎనభై రెండు సంవత్సరాలు. పేరు గణపతిరాజు సూర్య నారాయణరాజుగారు. జ్యోతిష్యంలో మాంచి దిట్ట. అలాగే ఆయుర్వేదంలో కూడా. ఆశ్రమం దారి పట్టారు అవధానిగారు.

"ఇప్పుడు మనం చూస్తున్న ప్రపంచ పటం వేరు. త్రేతాయుగం నాటి ప్రపంచ పటం వేరు. భద్రాచలంలో సీతారామ కల్యాణం నాడు వేదపండితులు చదివే 'మహా సంకల్పం' వింటే కొంత అర్ధమవుతుంది రామాయణంలో సీతని పుష్పక విమానంలో తీసుకొస్తూ, అప్పటి భూప్రదేశాలనీ పుష్పక కొండల్నీ, పర్వతాలనీ శ్రీరామచంద్రుడు వివరిస్తాడు. ఆ 'పటం' ఇప్పుడు కనిపించదు. కారణం భూమిలోనూ సముద్రంలోనూ వుండే అనేకానేక అగ్నిపర్వతాలు పేలి, భూమి పగుళ్ళు విచ్చి దూరంగా జరిగింది. ఒక్కటిగా వున్న భూమి ఆ పగుళ్ళవల్ల ఖండాలుగా మారిపోయింది. ఆ తరవాత మహాభారత యుద్ధంలో కూడా కురు, పాండవులు వాడిన అనేక అస్త్ర శస్త్రాల భీభత్సాల వల్ల భూమి మరిన్ని పగుళ్ళు విచ్చి మరిన్ని దేశాలుగా మారింది. అంతేగాక, కొన్ని ప్రదేశాలు నీళ్ళల్లో అంటే, సముద్రంలో మునిగిపోతే, కొన్ని ప్రదేశాలు సముద్ర జలాన్ని పక్కకి తోసి పైకి తేలాయి. అలా కొన్ని ద్వీపాలు బయటపడిన విషయం అందరికీ తెలిసిందే

అబ్బాయిగారూ, కాలం దేనికీ లొంగదు. అది అవిచ్ఛిన్నంగా సాగుతూనే వుంటుంది. ప్రకృతిలో రహస్యాలు పరమేశ్వరుడికి తప్ప మనుషుల బుద్ధికి అందవు. కేవలం కొన్ని సూచనలు మాత్రం అందుతాయి." సుదీర్ఘంగా మాట్లాడరు సూర్యనారాయణరాజుగారు.

చాలా చాలా ఏళ్ళ తరవాత ఆయన తన జ్యోతిష్య గ్రంథాల్ని దుమ్ముదులపటం జరిగింది. సహజంగా సూర్రాజు (సూర్య నారాయణరాజు) గారు మితభాషి. ఇవ్వాళ మాత్రం అనర్గళంగా మాట్లాడటం సత్తిరాజుగారికి చిత్రంగా అనిపించింది.

"ఈ సర్పాల సూచన ఏమిటి నాయనగారూ?" అడిగారు సత్తిరాజుగారు.

"అది తెలియాలంటే మహాభారత కాలం నాటికి పోవాలి. 'స్నేహానికి' కాల నియమం లేనట్టే 'పగ' కి కూడా కాలనియమంలేదు" నిట్టూర్చారు సూర్రాజుగారు.

"ఎవరిమీద పగా?" అడిగారు సత్తిరాజు.

"గెలుపు మీద పగ. ధర్మం మీద పగ. ఇంకోలా చెబితే భగవంతుడి మీద పగ" నిట్టూర్చి అన్నారు సూర్రాజు. తండ్రి మొహాన్నే చూస్తూ ఆశ్చర్యపోయారు సత్తిరాజు. తండ్రిగారి మొహంలో ఓ విషాద వీచిక.

"పంచదార నీటిలో కలిసిపోయినంత తేలిగ్గా ఆత్మలు పరమాత్మలో లీనమైపోతాయి. వాటికథ వేరు. అదే, ఇసుక నీటిలో కరుగుతుందా? అలాగే కొన్ని ఆత్మలు ఎన్ని తరాలైనా, యుగం మారినా కూడా పరమాత్మలో లీనం కావు. కారణం వాటిని చుట్టుకుని వుండే దుర్భేధ్యమైన అహంకారం. పగ తీరేవరకూ అవి శాంతించవు. ఇదీ దైవ సృష్టిలోని ఓ భాగమే. ఓ

పరమ రహస్యమే. అడవి అంటుకున్నప్పుడు అక్కడి చెట్లూ చేమలేకాదు, అడవిలోని సమస్త ప్రాణకోటి తగలబడిపోతాయి. అలాగే యీ 'పగలు' పక్కానికి వచ్చినప్పుడు భయంకరమైన విధ్వాంసాలు జరుగుతై. ఉత్పాతాలు చెలరేగుతై" మళ్ళీ నిట్టూర్చారు సూర్రాజుగారు.

'ఆపే మార్గమే లేదా?"

"ఉంది. విధ్వంసకర శక్తులన్నీ ఒక్కచోటికి ఎలా చేరతాయో రక్షించగల శక్తులు కూడా ఒకే చోట చేరాలి. అబ్బాయిగారూ, విశ్వరచనలోని రహస్యం ఇదే **వాయువు, అగ్ని రెండిటి సంయోగం వల్లనే జలం పుట్టింది. మళ్ళీ ఆ అగ్నిని ఆర్పాలంటే అది జలానికి మాత్రమే సాధ్యమౌతుంది."**

లేచి నిలబడ్డారు సూర్రాజుగారు. ఓ కృష్ణ పక్షి కృష్ణా కృష్ణా అని అరిచింది.

"శుభం... కృష్ణ పక్షి అరుపు వినడం అత్యంత శుభకరం. చూద్దాం. ఇంకొంత చదవాలి. ఇంకొంత శ్రమించి లెక్కలు కట్టాలి" ఈసారి సూర్రాజుగారి గొంతులో ఉత్సాహం తొంగి చూసింది.

తక్షపురం అట్టుడికిపోతోంది. నెలలతరబడి మండపంలో పడివున్న ముసల్ది ఆ రోజున ఎవరికీ కనిపించలేదు. ఆమె జాడలే కనపడలా. అంతకు ముందు రోజంతా కనపడిన వాళ్ళందరికీ శాపనార్థాలు పెడుతూ, లోకం సర్వనాశనమైపోతుందనీ, కోటి పడగల నాగు కోరలు చాచి వస్తోందనీ చెప్పీ చెప్పీ నవ్వీ నవ్వీ ఆనందపడిందిట.

"కోటి పడగల నాగు అంటే?" అని ఓ యువకుడు అడిగితే, "కరికాలనాగుడు రా.... కరికాలనాగుడు. ఎవర్ని చూసిన వెంటనే కళ్ళు పటాల్న పేలిపోతాయో, ఎవరి బుసబుసలు వింటే చెవులూ తలలూ పేలిపోతాయో, ఎవరు విషం చిమ్మితే యోజనాలకి యోజనాలు దగ్ధం అవుతాయో, ఆ కరికాల నాగు. చావండి. నాగశాపాన్ని నరులు అనుభవించకతప్పదు." అని రూక్షణంగా బదులిచ్చిందట ఆ ముసల్ది. ఆ మరుసటి రోజున ఆమె జాడేలేదు. సర్పశిలా మండపంలోని సర్పాలకీ జీవకళ మరింత పెరిగింది. సజీవ సర్పాలా అనే భ్రాంతి కలిగిస్తున్నాయి.

'ఏదో మూడింది. అన్నీ దుశ్శకునాలే. "నీరసంగా అన్నాడు ఆ వూరిలోని అతి వృద్ధుడు. ఆయనకి నూట రెండు సంవత్సరాలు.

"అవును తాతా. తెల్లవారు ఝామునే అందరి ఇంటిముందూ అందమైన ముగ్గులు వేశామా, ఇప్పుడు చూస్తే ఆ ముగ్గులన్నీ చెరిగిపోయి వున్నాయి. వాటి మీంచి పాములు పాకినట్టు చిందరవందరగా వున్నాయి" చెప్పిందో ఇల్లాలు.

"కాకులు తెగ అరిచాయి తెల్లవారు ఝామునే. ఇహ కుక్కలయితే ఏడుపు ఆపలేదు" అన్నాడు మరో నడివయస్కుడు.

"కొన్ని రాబందులు వూరి మీదుగా ఎగురుతూ ఉత్తరం వైపు వెళ్ళాయిట" చెప్పాడు మరో యువకుడు.

"ఇవన్నీ ఓ మహా ప్రళయానికి సంకేతం కదూ?" కుతూహలంగా అడిగిందో యువతి.

"తాతా, యీ తక్షపురానికీ, మహాభారతానికీ చాలా సంబంధం వుందంటారు నిజమేనా? అసలీ తక్షేశ్వరాలయంలో వున్న నాగశిల తక్షకుడిదేనటగా?" అడిగాడు మరో పరదేశీ.

"నాగజాతికీ మానవ జాతికీ సంబంధ బాంధవ్యాలు వున్నాయా? నాగాలాండ్ అంటాం కదా వారి పూర్వీకులు నాగవంశం వారా? అలాగే ఎన్నో దేవాలయాల్లో, ముఖ్యంగా శివాలయాల్లో నాగప్రతిష్ఠలు చేస్తారు. అలా చేస్తే పిల్లలు పుడతారనే నమ్మకం ఎప్పటినించో వుంది. అలాగే నాగుల చవితినాడు పుట్టల్లో పాలు పోస్తాం. చిమ్మిరిని నైవేద్యంగా పెడతాం. నాగపంచమి రోజున కూడా పూజలు చేస్తాం. వీటన్నీటి వెనకా నిగూఢమైన రహస్యం ఏమైనా వుందా?" చాలా ప్రశ్నల్ని కలగలిపి ఏక ప్రశ్నగా సంధించాడో మహోత్సాహి.

తాత ఏమీ మాట్లాడలేదు. ఏదేదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. అడిగిన వాళ్ళు అతను మౌనం వీడక పోవడంతో ఎవరిదారి వాళ్ళు చూసుకున్నారు.

"పుట్టింది నాగు
పెరిగింది నాగు
పడగెత్తి బుసబుసలు
కొట్టింది నాగు
ఎదిరించు మొనగాడు
ఎక్కడున్నాడో
తొడగొట్టు మొనగాడు
ఎప్పుడొస్తాడో
ఛెంగుమంటూ ఎగిరి
చేత పడగను బట్టి
వంచేటి మొనగాడు
ఎక్కడున్నాడో
ఎప్పుడొస్తాడో!
కాలాన్ని గెలిచేటి
కాలుడెవరమ్మా (ఈశుడు + ఎవరమ్మా)

పాముల్ని ధరియించు

ఈశుడెవరమ్మా (రాముడు + ఎవరమ్మా)

గురు జంగమయ్యకూ
కోటి దండాలు
శంఖాలు వూదితే
కలుగు పుణ్యాలూ...."

ఎవరో దూరంగా పాడుకుంటూ పోతున్నారు. ఆ స్వరం మధురంగా వుంది. 'ఎవరో జంగం దేవర అయ్యుండాలి అనుకున్నాడు తాత.

'అవునూ. ఆ పాటకి అర్థమేమిటి?' మళ్ళీ తనలో తనే ప్రశ్నించుకున్నాడు తాత. ఓ రెండెడ్ల బండి అతని ముందు ఆగింది, అది దోసకాయలు అమ్ముకునే సోముల్ది.

"తాతా.. ఎవరో పరమేశ్వర శాస్త్రిగారట. త్వరలో నిన్ను కలుస్తానని చెప్పమన్నారు" తాతతో అన్నాడు సోములు.

ఠక్కున లేచి నిలబడ్డాడు తాత. అతని పేరు దక్షుడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments